

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

### ఒకనాటి ప్రేయసి

"**హేమూ.** ఓ నిమిషం బయట వెయిట్ చెయ్. బిల్ కట్టేసి వస్తాను." తల్లికోసం కొన్న పళ్ళు, ఆరెంజ్ జ్యూస్‌లకి డబ్బు చెల్లించి, కేష్ కౌంటర్ నించి బయటకి వస్తున్న హేమంత్ ఆ మాటలకు ఉలిక్కిపడి ఆగిపోయాడు.

తనని హేమూ అని పిలిచే ఆ వ్యక్తికోసం ఆత్రంగా చూసాడు. బాస్కెట్‌లో సామానుతో క్యూలో నించున్న ఓ యువతి అతన్ని చూసి నవ్వి చేయి ఊపింది.

హేమంత్ గుండె లయ తప్పింది. నీరూ! నీరజ! చదువుకునే రోజుల్లో తన ప్రాణం. తను పిచ్చిపిచ్చిగా ప్రేమించిన ప్రేయసి. దాదాపు ఇరవై ఏళ్ళ తర్వాత!

సూపర్ బజార్‌లోంచి బయటకి వచ్చి ఓ పక్కన నుంచున్నాడు. అతనిలో ఏక కాలంలో ఆనందం, విషాదం.

డిగ్రీ చదువుకునే రోజుల్లో హేమంత్ అనుకోకుండా నీరజ ప్రేమలో తలమునకలుగా మునిగిపోయాడు. ఆమెలోని లాలిత్యం, అందం, సున్నితమైన మనసు. స్పందించే తీరు... నీరజని మిగిలిన వాళ్ళకన్నా భిన్నంగా చూసిన హేమంత్ ఆమెకి పెళ్ళి కుదిరిందని తెలిసి తల్లడిల్లిపోయాడు.

"సారీ హేమూ నాన్న ఎంత చెప్పినా వినడంలేదు. అంతా విషం తాగుతామని బెదిరిస్తున్నారు" బేలగా చెప్పింది నీరజ.

'నీరజ లేని ఈ జీవితం వృధా' అని లేఖ రాసి ఆ రాత్రి నిద్రమాత్రలు మింగాడు హేమంత్. ఫ్రెండ్స్ సకాలంలో స్పందించడంతో రెండురోజుల తర్వాత హాస్పిటల్‌లో కళ్ళు తెరిచాడు. తల్లితండ్రులు వచ్చి ఏడ్చి ఇంటికి తీసుకెళ్ళారు. ఆ సంవత్సరం అతని చదువుపోయింది. నీరజ పెళ్ళయిపోయింది.

మళ్ళీ ఇన్నేళ్ళ తర్వాత నీరజ ఇలా కనిపించడం హేమంత్‌కి ఆశ్చర్యంగా ఆనందంగా ఉంది.

"పద వెళ్దాం. మా ఇల్లు ఈ పక్కనే." చేతిలో కళాంజలి సంచితో వచ్చిన నీరజ ముందుకి నడుస్తూ చెప్పింది.

అప్రయత్నంగా ఆమె వెనకే నడిచాడు. దాదాపు ఇరవై ఏళ్ళ తర్వాత కలిసినా, నిన్నో, మొన్నో కలిసినట్లుగా ఉంది నీరజ ధోరణి.

నీరజ పెద్దగా మారలేదు. వయసు ప్రభావంతో కొద్దిగా వెడల్పయింది. మొహంలో అదే అందం. అదే పొడుగు జడ. ఈ అందాల రాశి తనకి దక్కకుండా పోయింది.

అతని మనసు బాధతో మూలిగింది.

"ఎలా ఉన్నావు హేమూ? ఈ ఊళ్ళోనే ఉంటున్నారా? పిల్లలెంత మంది? మీ ఆవిడ అంత బావుండదటగా? మీ పెళ్ళికి వచ్చిన గ్రేస్ చెప్పింది" నీరజ అతని పక్కనే నడుస్తూ అడిగింది.

"వాణి బానే ఉంటుంది. రంగు తక్కువైనా కళగా ఉంటుంది." భార్యని మెచ్చుకున్నాడు.

"ఓ! సరేగాని ఎక్కడ పనిచేస్తున్నావు?" అతను భార్యని మెచ్చుకోవడం నచ్చనట్లుగా టాపిక్ మార్చింది నీరజ.

"ఆర్నెల్లయింది ఈ ఊరికి బదిలీ అయి ఒక బాబు. ఇంటర్ ఫస్టియర్. నీకెంతమంది పిల్లలు నీరూ?" అడిగాడు.

"పాప ఇంజనీరింగ్ ఫస్టియర్. చాలా గేప్ తర్వాత ఒక బాబు ఫిఫ్త్ చదువుతున్నాడు."

నీరజ ఓ చిన్న ఇండిపెండెంట్ ఇంట్లోకి దారి తీసింది. ఆమె వెనక లోపలికి నడిచి, గేటు మూసి చుట్టూ చూసాడు. ఆవరణలో చిన్న పూలతోట ఉంది. ఆదరణ లేనట్లుగా మొక్కలన్నీ ఎండిపోయాయి. ఇంటివరండాలో చిన్న ఉయ్యాల, రెండు పేము కుర్చీలు, ఒక పేము టీపాయ్ ఉన్నాయి. టీపాయ్ మీద ఎండిపోయిన కాఫీగ్లాస్ మీద ఈగలు ముసురుతున్నాయి.

నీరజ బెల్ కొట్టి, ఓ క్షణం ఆగి అసహనంగా తలుపు మీద బాదింది. ఓ చిన్న పిల్లవాడు తలుపు తెరిచి ఆనందంగా 'అమ్మా' అని అరిచి ఆమె కాళ్ళకి చుట్టుకున్నాడు.

"తలుపు తీయడానికి ఇంతసేపా? ఏం చేస్తున్నావురా?" అరిచింది.

"నాకు గాల్లో ఎగరడం రాదమ్మా. నడిచి వచ్చి తీసాకదా?" వాడు కొంటెగా చెప్పాడు.

నీరజ, హేమంత్ నవ్వేసారు. లోపలికి వెళ్ళిన హేమంత్ సోఫాలో కూర్చుని కాళ్ళకి తగిలిన బొమ్మలు తీసి పక్కన పెట్టాడు.

"నీ పేరేంటి?" తనవైపు కుతూహలంగా చూస్తున్న ఆ కుర్రాడ్ని అడిగాడు.

"గౌతమ్. మీరెవరూ?" వాడు షేక్ హేండ్ ఇస్తూ అడిగాడు.

"మీ అమ్మ ఫ్రెండ్‌ని." వాడిని దగ్గరకి తీసుకున్నాడు.

"వాడు డేంజరస్ ఫెలో. అలాంటి మాటలు చెప్పకు. ఇంట్లో చీమ చిటుక్కుమంటే వాళ్ళ నాన్నకి చెప్పేస్తాడు." నీరజ మంచినీళ్ళగ్లాస్ అందిస్తూ చెప్పింది.

"చెపితే ఏమవుతుంది? నేను నీ ఫ్రెండ్‌నేగా?" హేమంత్ ఆశ్చర్యంగా అడిగాడు.

"మా వారు నేను అసూర్యంపశ్యని అనుకుంటున్నారు. ఆయన్ని ఆ భ్రమలోనే ఉంచితే ఆయనకీ ఆనందం, మనకీ ఆనందం" నవ్వేసింది.

హేమంత్ మనసు చివుక్కుమంది. 'అది మోసం కదా?' అని అడగాలనుకున్నాడు. కానీ మౌనంగా ఉండిపోయాడు. అతనికి ఇబ్బందిగా అనిపించింది.

"నీర్జా! ఎవరితో మాట్లాడుతున్నావు?" లోపలనించి ఓ వృద్ధకంఠం కీచుగా అడిగింది.

నీరజ మొహం కోపంతో ఎర్రబడింది.

"అన్నీ ఈవిడకే కావాలి" గొణుక్కుంది. తర్వాత పెద్ద గొంతుతో చెప్పింది.

"మా దూరపు బంధువు అత్తయ్యా.. ఈ ఊరు వస్తూంటే, మా అమ్మ మనింటికి వెళ్ళమని మరీమరీ చెప్పిందిట."

ఆ గొంతుకి, ఆ అబద్ధానికి హేమంత్ బిత్తరపోయాడు. తనకి తెలిసిన నీరజ మాట్లాడుతూంతే, తను మధ్యమధ్యలో వినపడక 'ఏమిటి?' అని అడిగేవాడు. అంత మెత్తగా, మల్లెలు కురిసినట్లుగా మాట్లాడేది. ఇంత పెద్దగొంతుతో అరవడం ఎందుకు? ఆవిడ దగ్గరకెళ్ళి చెప్పిరావచ్చుగా? దానికి తోడు బంధువని అబద్ధం కూడా!

హేమంత్ అసౌకర్యంగా కదిలాడు.

"ఈ ఇల్లు మాదే 1990లో కొన్నాం. ఐదువందల గజాలు. ఇప్పుడు గజం లక్షన్నర ఉంటుంది. ముందు వెనక చాలా స్థలం ఉంది. మా వారికి ముందు ఫ్లవర్ గార్డెన్, వెనక కిచెన్ గార్డెన్ పెంచాలని కోరిక. నాకు మట్టి ముట్టుకోవాలంటేనే చిరాకు. 'కనీసం వాటికి నీళ్ళు పట్టు' అంటారు. ఆ పని చేసాననుకో. ఇక మొత్తం నాకే నెమ్మదిగా అప్పగిస్తారు. అందుకని చచ్చినా తోటపని వైపు వెళ్ళను. ఆయన కేంప్‌కి వెళ్ళి వారమైంది. మొక్కలన్నీ ఏడుస్తున్నాయ్ కానీ పంతానికి నీళ్ళు పోయడంలేదు. వచ్చి పాపం భోరుమంటారు." నీరజ నవ్వుతూ చెప్పింది.

"పోనీ మీ అమ్మాయి పోయచ్చుగా? మొక్కలు ఎండిపోయాయి." జాలిగా చెప్పాడు.

"దాని కసలు ఒళ్ళొంగదు. చదువు తప్ప మరో ధ్యాసలేదు. ఉఁ ఇంక చెప్పు. ఎంత సంపాదించావు? ఎన్ని ఇళ్ళు కొన్నావు? మీ ఆవిడకి డైమండ్ నెక్లెస్ ఉందా? నాకు లేదు కానీ మా పాపకి కొన్నాం మొన్నే. నాకో రెండు కిలోల నగలుంటాయి." కొద్దిగా వంగి గుసగుసగా చెప్పింది.

"మా అత్తగారి ఒంటిమీద అరకిలో బంగారమైనా ఉంటుంది. 'మోయలేరు ఇవ్వండి అత్తయ్యా బీరువాలో పెడతా' అన్నా ఇవ్వదు. పోయేప్పుడు కట్టుకుపోతుందేమో!"

హేమంత్ మతిపోయినట్లు చూసాడు. గౌతమ్ ఏదో చెప్పాలని తల్లి దగ్గరకి పరిగెత్తుకొచ్చాడు. వాడి కాలు తగిలి హేమంత్ తాగి కిందపెట్టిన మంచినీళ్ళ గ్లాస్ గింగరాలు తిరిగి ముక్కలు చెక్కలైంది.

కోపంతో ఊగిపోయిన నీరజ వాడి వీపు మీద ఛెళ్ళు ఛెళ్ళున నాలుగు దెబ్బలు కొట్టింది. నవ్వుతూ తల్లి దగ్గరకి వచ్చినవాడు ఏడుపు లంకించుకున్నాడు.

"వెధవా! సెట్టు రెండువేలకి కొన్నాను. ఇంటికి ఆరుగురు వస్తే ఏ గ్లాసులతో ఇవ్వాలిరా నీళ్ళు? కళ్ళు నెత్తిన పెట్టుకున్నావా? అరిచింది.

"నీర్జా! ఏమైందే? వాడ్ని ఎందుకు కొడుతున్నావు?" లోపలనించి అత్తగారు కీచుగా అడిగింది.

"మీరు నోరుమూసుకుంటారా?" అరిచి, నెమ్మదిగా గొణుక్కుంది.

"ఈ ముసలిముం....చస్తే గానీ నాకు శాంతి లేదు." హేమంత్ తక్కున లేచి నుంచున్నాడు.

"వెళ్తా నీరజా. ఇంకోసారి వస్తా."

"అయ్యో! అలా ఎప్పుడు పడితే అప్పుడు రాకు. మా ఆయనుంటే అదో గొడవ. నీ ఫోన్ నంబర్ ఇవ్వు. ఆయన లేనప్పుడు కాల్ చేస్తా" నీరజ అతని వెనక నడుస్తూ అడిగింది.

ఆ మాటలు విననట్లుగా హేమంత్ వేగంగా బయటకి నడిచాడు.

సూపర్ బజార్ ముందు ఆపిన కారు ఎక్కి ఇంటివైపు వెళ్తూంటే అతని మనసు బాధతో మూలిగింది.

సుకుమారి నీరజ ఓ గాజుగ్లాస్ కోసం కొడుకుని కొడుతోంది. పుష్ప విలాపం విని కన్నీరు పెట్టుకునే ఆమె మొక్కలకి నీళ్ళు పోయాలంటే విసుక్కుంటోంది. అత్తగారిని తిడుతోంది. భర్తని మోసం చేస్తోంది.

'ఇద్దరం కలిసి కూలో, నాలో చేసుకుని బతుకుదాం హేమూ, ప్రేమని తిందాం, ప్రేమని తాగుదాం' అని చెప్పిన నీరజ ఆస్తులు, నగలు గురించి మాట్లాడుతోంది. అవి చాలక అత్తగారి నగలకి ఆశపడుతోంది.

ఈ మనిషి కోసమా తను నిద్రమాత్రలు మింగింది?

ఈ మనిషి కోసమా తను చావాలనుకుంది?

'థాంక్‌గాడ్! దేవుడు దయామయుడు. నీరజతో పెళ్ళి రాత రాయకుండా తనని రక్షించాడు. తనకి మంచి జీవితం అందించాడు' మనసులోనే దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

అతని ఫోన్ మోగింది. భార్యనించి.

"అత్తయ్యకి పళ్ళు, జ్యూస్ తీసుకున్నారా?" వాణి మృదువుగా అడిగింది.

"తీసుకున్నా. ఇంకో ఐదు నిమిషాల్లో ఇంట్లో ఉంటా" ఓ క్షణం ఆగి భార్యతో చెప్పాడు.

"వాణీ! నీకెప్పుడైనా చెప్పానా? ఐ లవ్ యూ!"

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments